# శ్రీరామ

## పాలగుమ్మి వెంకటేశ్వరరావు

'శ్రీరామ' గట్టిగా వుచ్చరించాడు ఉద్దండం ఉక్కతో, ఆయాసంతో తెగ రొప్పాడు. ప్రొద్దుట్నించీ, ఆకాశంలో ఎక్కడా మబ్బు తునక లేదు. సూర్యుడు సర్వ ప్రపంచాన్నీ తుకతుకలాడించేస్తున్నాడు. ఎక్కడా ఒక్క గాలి రివటా లేదు. చెట్లూ, చేమలూ కళదప్పి ఎండలో మలమల మాడ్తూ చిటచిటలాడ్తున్నాయి. కుక్కలు చొంగలు కారుస్తూ అటు ఇటు పరుగులు పెట్తున్నాయి.

బయట్నుంచి బిక్కుబిక్కుమంటూ దొంగ చూపులు చూస్తూ అప్పుడే దొడ్లోకి చొరబడ్డాడు దిబ్బయ్య. మాసిన పీలిక ఒకటి దిబ్బయ్య నడుముకి చుట్టుకుని వుంది. వెన్నుపూసకి అంటిన కడుపుకి పైభాగాన వున్న ప్రక్కటెముకలు చర్మాన్ని చీల్చుకుని ముందుకి వస్తున్నాయి. ఉద్దండాన్ని చూసి దిబ్బయ్య నడక ఆగిపోయింది.

"శ్రీరామ" గర్జించినట్లు అన్నాడు ఉద్దండం.

ఆ గర్జనకి దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే !" ఉరిమి చూశాడు ఉద్దండం ఆ చూపులో తీక్షణత వుంది !

దిబ్బయ్య ఆగిపోయి నిలబడిపోయాడు. చమట్లు ధారలుగా కారి, ఉద్దండం నుదుట వున్న పంగనామాలు రూపు మాసిపోవటానికి సిద్ధంగా వున్నాయి ఆయాసంతో రొప్పుతున్న ఉద్దండం కడుపు పైకీ క్రిందికీ వూగింది కోపం పొంగి వచ్చింది.

"ఎక్కడ్నించిరా వస్తున్నావు ?"

"పడమటి పొలంనుంచండి."

"ఎంతవరకూ వచ్చిందిరా, నీ పనీ ?"

"దుక్కి దున్నటం అయిపోయిందండి, రేపో మాపో నీళ్ళు బెట్టి నాట్లు వెయ్యించాలి."

"శ్రీరామ" అరిచాడు వుద్దండం.

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఏరా ? ఇవ్వాళ మంచిది గాదని ఎవడన్నా చెవులో పువ్వు పెట్టుకున్నవాడు నీకు చెప్పేడ్రా ?"

"........."

"ఏంట్రా అట్లా వెర్రిచూపులు చూస్తావ్ ? ఆ నీళ్ళేదో ఇవ్వాళే పెట్టి ఏడ్చి, ఆ నాట్లు ఏవో వెంటనే ఎందుకు వెయ్యరాదూ, అని అడుగుతున్నానురా, నేను."

"ఇప్పుడే గదండి దుక్కి దున్నటం అయింది. చెలక ఆరాలి గదా..."

"ఆరాలిరా, ఆరాలి. ఈలోగా నా కొంపే ఆర్పుతావు ? శ్రీరామ ... రామ రామా !"

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"సరే అదేదో త్వరగా ఏడ్వు. అవునా ? ఇకపోతే మరి ఆ బస్తీకి పోయి ఆ ఎరువుల బస్తాల్ను ఎప్పుడు వేసుకుని వస్తావురా ?"

"ఇవ్వాళో రేపో వెళ్ళిరావాలండి."

"ఆ ఆకుమడిని పీకించాలి గద."

"అవునండి. కూలీల్ని మాట్లాడాను, ఎల్లుండి.."

"ఇంట్లో న్నాల్రోజుల్నించీ కరంటు లేదు. ఆ ఎలక్ట్రీషియన్ని నీవు పిల్చుకు రావాలి. జరూరు. కరంటు రాపోతే నేను పోయేట్టు వున్నాను ! అబ్బబ్బ."

"చిత్తం. వెళ్ళి తీసుకు వస్తానండి."


"శ్రీరామ" - 'ఢాం' మని ఎక్కడో్న దూరాన కొండల్లో ప్రేలుడు -

"నువ్వు అమ్మాయిని దీసికెళ్ళి పాలెంలో అత్తవారింటి దగ్గర బండిగట్టి తీసుకెళ్ళి దింపి రావాలి. వాళ్ళు అసలే మూర్ఖపు ముండా కొడుకులు !"

"అయ."

"ఆ కంసాలి బత్తుడు అమ్మాయి నగల్ని ఇవ్వాళా రేపూ అన్చెప్పి ఇవ్వకుండా దిప్పుతున్నాడు. అవి బట్టుకరావాలి - ఆ ఎద్దుల్నేం జేశావ్ ? ! వాటి మానాన వాటిని ఎండలో వదిలేశావా ? ఒరే వాటి చేత ప్రొద్దుట్నించీ చాకిరీ చేయించుకుని అలా వదిలేయటం పాపంరా. నోరులేని జీవాల్ని అట్లా ఏడిపిస్తే మళ్ళీ నువ్వు మనిషి పుటక పుట్టవురొరే ! నీ బుద్ధిని మార్చుకోవాలి మరి ! కాదంటే నీ ఖర్మ, నీవే అనుభవిస్తావ్ ! నీ ఇష్టం."

"ఎద్దుల్ని పాకలో కట్టేసి, నీళ్ళుబెట్టి మేత వేసి వస్తున్నానండి, ఇప్పుడే."



"ఆ మాట ముందే ఏడ్వవద్దా ? సర్లె, సర్లె. పోయి ఆ ఎలక్ట్రిషియన్ని పిల్చుకురా, పో. పోమరి."

"ఇంత ముద్ద దిని పోతామనుకుంటున్నా స్వామీ!"

"శ్రీరామ" ఉరిమాడు ఉద్దండం.

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే ! నాకు దెలవక డుగుతానూ ? ఎప్పుడు జూసినా 'ముద్ద ముద్ద' అని ఏడుస్తూ తిరుగుతావ్ ! మనిషికి ముద్దే మోక్షమట్రా ?! అంత ఆకలి అయితే ఆ ముద్దని మట్టికి కట్టుకునే తిరగ రాదట్రా ?!"

"పొద్దుట్నించీ కడుపులో ఏమీ పడలేదండి. ఆకలి ..."

"ఆకలీ ! ఆకలి ! ఒక్క పూట తిండి దినక పోతే చచ్చిపోతావట్రా ?"

"ఎండలో దుక్కి దున్ని వచ్చానండి."

"శ్రీరామ !"

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే ! పిచ్చి వెధవా ! అమ్మగారు వూరి మీదకి పెత్తనానికి వెళ్ళి గంటన్నరయింది. ఆవిడగారు తిరిగి రావాలి. పొయ్యి వెలిగించి అన్నం వండి వార్చాలి; నీ పళ్ళెంలో గుమ్మరించాలి; అప్పుడు గదా నీ ఆకలి దీరేదీ ... అంచు వలన ... పిచ్చి పిచ్చి ఆశలు పెట్టుకోక వెంటనే పోయి ఆ ఎలక్ట్రిషియన్ని పిల్చుకురా. ఎండకి చచ్చిపోతావున్నాను. గాలిలేదు, చమటరా. ఒరే ! దీని బాధ ఇంతని చెప్పలేను. అట్లాగే దోవలో నేనెప్పానని చెప్పి ఒక రూపాయి పకోడీలు కట్టించుకురా నరహరి శెట్టి దగ్గర ... తిరిగి వచ్చాక కుంభం ఆరగిద్దువుగానిలే. ఏ పాటు దప్పినా సాపాటు దప్పదు గదా."

"అయ్యా ..."

"పో. పో. పోయిరా, వేగరం...శ్రీరామ రామ. ఈ ఆకలిని ప్రపంచం నుంచి మాయం చేయ రాదటయ్యా మంగళాకారా ! – పిచ్చి వెధవా ! ఇంకా ఇక్కడ్నే వున్నావా ? నాకు కోపం వస్తే అసలు నేను మనిషిని కానురో, వెర్రి వెధవా !"

దిబ్బయ్య కాలే కడుపుని చేత్తో పట్టుకుని, తుర్రుమన్నాడు తూనీగలాగ.

"శ్రీరామ"

ఆపసోపాలు పడ్డాడు ఉద్దండం.

"శ్రీరామ రామా ! జానకీ వల్లభా !"

ఉద్దండం చెమటతో తడిసి ముద్దయిపోయాడు. కడుపులో గురగురమనింది. భారీగానే, పొద్దుట ఒకవిడత 'మిషన్లో' వేసిన ఆ భోజనం అరిగి పోయి కడుపులో కాళీగా వుంది. ఇప్పుడు పేగులు గుడగుడమన్నాయి. కండలు తీపులు పెట్టేయి. వంట బట్టిన కొవ్వు కరిగి చిమచిమలాడింది. ఆయాసం 'ఆకలి' వగర్పులు. వేడి వేడి నిట్టూర్పులు. అవస్థ.

నాయనా, అవస్థ ! శ్రీరామా ! ఆపద్బాంధవా ! అనాధ రక్షకా ! ఈ జీవుని వేదన, వినలేవా ? కావగ వేవేగ రాలేవా ? ఏడి వీడు ! ఈ వెర్రి వెధవ, ఈ బక్క సన్నాసి.

ఈ నోరులేని చవట – ఏమయిపోయినట్లూ ? ఏడీ ఆ ఎలక్ట్రిషియనూ ఏవీ ఆ నోరూరించే వేడి వేడి ఉల్లిపాయ పకోడిలూ ఏదీ దర్మపత్నీ! ఆదేమని అడిగితే – శ్రీరామా పెద్ద నోరు పెట్టుకుని మీదపడి పచ్చడి పచ్చడి చేస్తుంది గదా ! ఎవరండీ మన భారతనారికి స్వాతంత్ర్యం లేదని బల్ల లెక్క దంచేదీ ! పనికి మాలిన లెక్చర్లూ !...

స్రరున ఒక గాలి ప్రవాహం వూపుకుంటూ వెళ్ళింది, చెట్టు చేమల్ని.

అమ్మయ్యా! దీనెమ్మ కడుపు చల్లగా వుండ ! రావే గాలీ, హాయిగా.

ఒక మూలన ఆకాశంలో నల్ల మచ్చ అవుపించింది. క్షణాలలోనే ఆది పెద్దదయి ఆకాశాన్నే ఆక్రమించింది. చల్లని చల చల్లని గాలి వీచింది. సూర్యుడు మరుగున పడి పరుగు లంకించుకున్నాడు. మబ్బుల దెబ్బకి తారెత్తిపోయి, విపరీతంగా సకిలించి – "శ్రీరామా !–" అని ఉద్దండం ఉరిమాడు. పట్టపగలే నల్లని చీకట్లు క్రమ్ముకుని వచ్చాయి. పరవశించిన చెట్టు చేమలు ఆకులలములను కదిలిస్తూ మౌనగీతాలు కమ్మగా పాడాయి. అంతలో కుండ పోతగా ద్రిమ్మరింపు మొదలయింది.

తడిసి ముప్పందుముయిన మంగళాంబ పెనుగాలి వలె – ఇంట్లోకి అడుగు పెట్టింది. మెరుపులు మెరుస్తుండగా వురుములు వురిమాయి. పిడుగులు పెళిల్లు పెళిల్లున పడ్డాయి.

"అయినయ్యా షికార్లూ ?" అనబోయిన ఉద్దండం నాలిక్కర్చుకున్నాడు.

రయ్యి రయ్యిన పెనుగాలులు వీచాయ్. ఉద్దండాన్ని క్రూరంగా, ఘోరంగా ఒక చూపు చూసి– "లేవండి లేవండి" అని గర్జించింది మంగళాంబ.

"ఏమిటే ? ఏమిటే ?!" అనబోయాడు ఉద్దండం.

"నోర్మూసుకుని లేవండి. లేవండి. మీరు మనుషులా ?! మానులా ! లేవమని మీకు కాదూ చెప్పటం ?! గాలి తోపుడికి క్రిందపడి, అమ్మాయి నడ్డి విరిగింది. బండి గట్టి ఆస్పటలుకి తీసికెళ్ళాలి, వేగిరం"

గాలివెంట తూనీగలా కొట్టుకుని వచ్చాడు దిబ్బయ్య.


"అయ్యా ? మా యాడది నొప్పులు పడతా వుందండి..."

"అయితే నన్నేంజెయ్యమంటావురా, అంట్ల వెధవా ? ముందు అమ్మాయిని ఆస్పటలుకి దీసి కెళ్ళాలి, బండి గట్టు. అర్జంటు"

"తుఫానుకి నా పాక ఎగిరి పోయిందండి. కబురు వచ్చింది – ఇప్పుడే"

"అయితే – నీ పెళ్ళాన్ని నా ఇంట్లోకి దీసు కొచ్చి పెడతానంటావా?" అదేం వల్ల కాదు అంతే, బండికట్టు అమ్మాయిని ఆస్పటలుకి దీసుకెళ్ళాలి వింటున్నావా ?"

"...నా భార్య చావుబతుకుల్లో వుందండి. దయదల్చాలి అయ్యగారూ ! ఈ పరిస్థితిలో నాకు మీరే దిక్కు. ఎక్కడికి దీసికెళ్ళను ? ఏం జెయ్యను ? నాకు కాళ్ళు చేతులు ఆడటం లేదండి. అది కంటానికి సిద్ధంగా వుందండి, ఎట్లానయినా మీరు ..."



"శ్రీరామ" గర్జించాడు ఉద్దండం.

పెఠిల్లు పెఠిల్లుమని పిడుగు పడింది.

దిబ్బయ్య గజగజ వణికిపోయాడు.

జోరుగా వాన కురవసాగింది. మంత్రం వేసినట్లు, గాలి మాత్రం ఆగిపోయింది. వాగులూ వంకలూ నిండి ప్రవహించసాగాయి. ప్రపంచాన్ని తెల్లని ముసురు ముసుగు కప్పి వేసింది. అప్పటివరకూ ఎండకీ, తాపానికీ అల్లాడిన ప్రపంచం - చలికి గజగజ వణకటం మొదలు పెట్టింది చిత్రంగా.

బురద బురదగా అయిన డొంక వెంట ఎద్దులు అతి కష్టంమీద బండిని లాగుతున్నాయి. వర్షంలో తడుస్తూ తొట్లో కూర్చుని ఎద్దుల్ని అదిలిస్తున్నాడు దిబ్బయ్య. బండిలో మూలుగుతూ ఏడుస్తూవుంది 'ఉద్దండం కూతురు.' ఆమెను ఓదారుస్తూ అవస్థ పడుతున్నారు, ఉద్దండం, అతని భార్య మంగళాంబా !

ఆ ముసురులో నల్ల నల్లగా ఒక ఆకారం ఆ బండికి ఎదురుగా వచ్చింది,

"ఎహే ! ఎహే ! పద ! పద !" దిబ్బయ్య ఎద్దుల్ని అదిలించాడు.

"ఎవరూ ! ఒరే ! దిబ్బయ్యా ! నువ్వేనా !?" అని ఆ ఆకారం ప్రశ్నించింది.

ఆ గొంతుని పోల్చుకుని - "ఆఁ. నేనేనే కోటయ్య మామా ! ఏంటి ఇశేషం ?" అని దిబ్బయ్య అడగ్గా ...

"ఒరే! నీభార్యని దీసికెళ్ళి సూకాల్లో పెట్టాంరా. వుప్పుడే మగపిల్లాడ్ని కనింది. మన దాసు పురుడు పోశాడు. తల్లీ, బిడ్డా క్షేమం. ఈ వార్త నీకు చెప్పిపోదామని వచ్చా. ఆ ఇషయం గురించీ డిగులెట్టుకోమాక. ఏం ?"

"సర్లె. సర్లె."

"అవునూ ... వుప్పుడు నువ్వెక్కడికిరా బండి గట్టుకునీ ? వాగులు నిండుగా పారుతున్నయ్!"

"సర్లె. నువ్వెళ్ళు మామా ! నే వస్తాలే. కాస్త పనుంది."

"ఎహే ! ఎహే !" బురదలో కురుకుపోతూన్న బండిని బరువుగా శక్తినంతట్నీ కూడదీసుకుని లాగుతున్నాయి ఎద్దులు. వర్షం జోరుగా కురవసాగింది.

"శ్రీరామ" - దూరంగా పిడుగు పడింది.

"నోర్మూయ్యండి" అంది మంగళాంబ.

"ఉద్దండం కూతురు బాధగా మూలిగింది. బండి భారంగా కదిలింది; కిరకిర లాడింది, వూగి వూగి.

వాగులూ వంకలూ దాటి, ఆ బండి నడవవలసిన దూరం చాలావుంది ! *

# నా పేరు ప్రతిభ

## శ్రీ మిరియాల రామకృష్ణ

ఎవరదీ ఝంఝామారుతంలా మనస్సులోంచి
ఉద్గమించి చుట్టూ కనిపించే ఏవస్తువైనా సరే ఆకర్షించి
అలా అలా ఎగిరిపోయి ఆశ్చర్యపరుస్తూ
కిందికి మందమలయానిలంలా వీస్తారు !
ఎవరదీ గ్రంథాలయాల్లో కూచుని నమూనాలు గీస్తూ
కళాకారుల శయనమందిరాల అందాల ననుకరిస్తూ
ఎప్పుడో ఉండుండి గుండెపునాది మీద
ఆరంతస్తుల భావమందిరం నిర్మిస్తారు!
ఎవరదీ పెద్దమ్మగారి దద్దమ్మపొలాలు దున్ని
చిన్నమ్మగారి చెంగల్వ సరస్సులో ఈది
సమాజం గురించి వాస్తవచిత్రాలు రచించి
కాలకుడ్యాల మీద ప్రదర్శన నేర్పాటు చేస్తారు!
__అది నేనే! -హృదయం నా సదనం
నాపేరు ప్రతిభ__ఉదయం నావదనం

# కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచిక

సుప్రసిద్ధ పండితులూ, చారిత్రిక పరిశోధకులూ అయిన కీ. శే నిడుదవోలు వేంకటరావు గారి స్మృత్యర్థం భారతి ప్రత్యేక సంచికని ఒక దానిని వెలువరించటానికి నిశ్చయించుకున్నాము

ఈ ప్రత్యేక సంచికలో శ్రీయుతులు పి. పరబ్రహ్మశాస్త్రి, ఇంగువ కార్తికేయశర్మ, వంతరాం రామకృష్ణరావు, ముదిగొండ ఈశ్వరచరణ్, చీమకుర్తి శేషగిరిరావు, తిరుమల రామచంద్ర తీర్థం శ్రీధరమూర్తి, వక్కలంక లక్ష్మీపతి సూర్యదేవర రవికుమార్ ముదిగొండ వీరేశలింగం, కీ. శే. రేకళిగ మఠం వీరయ్యగారల రచనలు పడగలవని తెలుపటానికి సంతోషిస్తున్నాము.

1985 డిసెంబరు భారతి, కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచికగా వెలువడటానికి ఏర్పాట్లు చేస్తున్నాము.

సంపాదకుడు